

# చదువు
నైపుణ్య



### అర్థవంతమైన చర్చల తర్వాతే ఆమోదం!

అర్థవంతమైన చర్చల అనంతరం మాత్రమే నా అభిప్రాయాన్ని ఆమోదించాలని నేను కోరుకుంటాను. నిలబడి మాట్లాడటానికి ధైర్యం కావాలి. కూర్చుని వినడానికి సహనం ఉండాలి. మనిషి తాను బయటకు చెప్పిన మాటలకు బానిస. తాను వెల్లడించని మాటలకు అధిపతి.

*- విన్‌స్టన్ ఎస్. చర్చిల్*



# బృందంలో మీరెక్కడ?

గ్రూప్ డిస్కషన్

**క్యాంపస్ రిక్రూట్‌మెంట్ రాత పరీక్షలో మంచి మార్కులు వచ్చాయి. 'ఇంటర్వ్యూలో ప్రశ్నలన్నింటికీ సరైన సమాధానాలు ఇచ్చేశాను. ఇక ఉద్యోగం ఖాయం' అనుకున్న ఒక అభ్యర్థికి ఆఫర్ లెటర్ రాలేదు. ఆశ వదులుకోలేక ఆ కంపెనీ హెచ్‌ఆర్‌ని కలిశాడు. మీలో గ్రూప్ డైనమిజం లేదు. బృంద చర్చలో చురుగ్గా లేకపోవడంతో ఎంపిక కాలేదని చెప్పారు. దానికి అతడు ఆశ్చర్యపోయాడు.**

**ఇప్పుడు కంపెనీలు తమకు కావాల్సిన లక్షణాలు అభ్యర్థుల్లో ఉన్నాయో లేదో తెలుసుకోడానికి రకరకాల పద్ధతులు పాటిస్తున్నాయి. బృందచర్చలు అందులో ప్రధానమైనవి.**



బృంద చర్చలు (గ్రూప్ డిస్కషన్స్) ప్రాంగణ నియామకాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ఈ చర్చలు ఎందుకు జరుగుతాయి? ఒక కీలకమైన అంశంపై వివిధ కోణాల్లో ఆలోచించి, అభిప్రాయాలను వ్యక్తం చేసి, స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవడానికే.

ప్రాంగణ నియామకాల్లో జరిగే బృంద చర్చ ఒక క్రమ పద్ధతిలో జరుగుతుంది. ఇందులో అభ్యర్థులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ నిర్దేశిత లక్ష్యంతో చర్చ సాగిస్తారు. ఇందులో నిరభ్యంతరంగా ఆలోచనలను వ్యక్తం చేయవచ్చు. ఒక అభ్యర్థి మరొక అభ్యర్థితో సంభాషించడమే కాకుండా బృందంలో చర్చించే వీలు ఉంటుంది. అభ్యర్థులు ఇతరుల అభిప్రాయాలను గౌరవిస్తూ చర్చను ఒక క్రమపద్ధతిలో కొనసాగించాలి. చర్చించాల్సిన అంశాన్ని ముందుగానే తెలియజేస్తారు. అయిదు నిమిషాల తర్వాత చర్చ మొదలవుతుంది. ప్రతి అభ్యర్థీ తన పరిజ్ఞానం మేరకు అనుభవాలను జోడించి విశ్లేషిస్తూ చర్చించాలి.



కె. రాజారాం
సాఫ్ట్‌స్కిల్స్ ట్రెయినర్

### ప్రాధాన్యం ఎందుకని?

బృంద చర్చ అనేది ఒక సంఘీభావ నైపుణ్యం. ఒక వ్యక్తి విద్యార్థి అయినా, ఇంజినీర్ అయినా, కంపెనీ ఎగ్జిక్యూటివ్ అయినా బృంద చర్చల్లో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తే ఉన్నతస్థాయిని చేరుకోవచ్చు.

కొద్దికాలం నుంచి నియామకాల్లో బృంద చర్చల ప్రాధాన్యం పెరిగింది. దీన్ని ముఖ్యంగా...

- సమస్యా పరిష్కారానికి
- విధాన నిర్ణయానికి
- వ్యక్తిత్వాన్ని అంచనా వేయడానికి ఒక సాధనంగా ఉపయోగిస్తున్నారు. సమస్యా పరిష్కారానికి, కీలక విధాన నిర్ణయాలు చేయడానికి బృందచర్చ చక్కటి మార్గం.
- ఉద్యోగంలోకి లేదా వృత్తి విద్యలోకి ఒక అభ్యర్థి ప్రవేశిస్తున్నప్పుడు అతడి వ్యక్తిత్వాన్ని అంచనావేయడానికి కూడా ఇది సాయపడుతుంది.
- సాధారణంగా బృందంలో 6 నుంచి 8 మంది ఉంటారు. చర్చాంశం ఒక అభిప్రాయం లేదా సమస్య కావచ్చు.
- చర్చ జరిగేటప్పుడు అభ్యర్థుల విభిన్న నైపుణ్యాలను ఎంపిక విభాగం సభ్యులు పరిశీలిస్తారు. ఇతరులను ఒప్పించే శక్తి, ఆత్మస్థైర్యం, అభిప్రాయాలను తార్కికంగా క్రమపద్ధతిలో విశ్లేషించడం, ఇతరులకు అవకాశం ఇవ్వడం, వారి మాటలకు స్పందించడం వంటి సహజ నాయకత్వ లక్షణాలను ప్రదర్శించాలి.

### మీరు నాయకులేనా?

బృంద చర్చలో పాల్గొనేటప్పుడు సహజ నాయకత్వ లక్షణాలను బేరీజు వేస్తారు. అనుకూలత, విశ్లేషణ, స్థిమితంగా ఉండటం, ఆత్మస్థైర్యం, వివేకం, నిర్ణయాత్మకశక్తి, సహనం అనేవి కొన్ని నాయకత్వ లక్షణాలు. చర్చ ప్రారంభానికి సుముఖత చూపి, చర్చకు సానుకూల వాతావరణాన్ని కల్పిస్తూ, సభ్యులందరి అభిప్రాయాలను క్రోడీకరిస్తూ అవసరమైన వివరణ ఇవ్వడం ద్వారా నాయకత్వ లక్షణాలను ప్రదర్శించవచ్చు. అర్థవంతమైన ముగింపు వైపు నిర్ణీత సమయంలో చర్చను తీసుకెళ్లడం కూడా నాయకుల పాత్రే.

### విజయానికి కావాల్సినవి

- బృంద లక్ష్య సాధనకు సంసిద్ధంగా ఉండటం
- సభ్యులతో అన్యోన్యత.
- చర్చాసరళిపై అవగాహన
- పరస్పర సహకార, సానుకూల వాతావరణాన్ని కల్పించడం
- భావ ప్రకటన మెలకువలు ఉండటం
- నిష్పక్షపాతంగా పాల్గొనడం
- నాయకత్వ భాగస్వామ్యం

### అన్నీ గమనించండి..

బృంద చర్చల్లో పాల్గొనాలంటే మొదట సబ్జెక్టు నాలెడ్జ్ అవసరం. జాతీయ, అంతర్జాతీయ, సామాజిక, ఆర్థికాంశాలు, శాస్త్రీయ, పర్యావరణ విశేషాలు, మన చుట్టూ జరిగే విషయాలపై అవగాహన ఉండాలి. ఇందుకు వార్తాపత్రికలు, మ్యాగజీన్‌లు చదవాలి. టీవీలో వచ్చే కార్యక్రమాలను చూడాలి. అనేక పరిణామాలను అనుసరించడానికి అంతర్జాలాన్ని కూడా ఉపయోగించుకోవాలి.

విషయ పరిజ్ఞానంతోపాటు భావవ్యక్తీకరణకూ ప్రాధాన్యం ఉంటుంది. ధైర్యంగా మాట్లాడటం, అభ్యర్థులందరినీ ఒప్పించడం, సరైన పదజాలాన్ని ఉపయోగించడం కూడా కీలకమే. శ్రవణ నైపుణ్యం చాలా అవసరం. చర్చ జరిగేటప్పుడు సరిగ్గా వినాలి. సందర్భోచితంగా స్పందించాలి. స్పష్టమైన ఉచ్చారణతో మాట్లాడితే బృంద సభ్యులను ప్రభావితం చేసి విజేతగా నిలుస్తారు. కంటి చూపు, శరీర భంగిమ, హావభావాలు, ముఖకవళికలు తదితరాలన్నింటిపైనా దృష్టి ఉంచి మసలుకోవాలి.

### మీరు ఫ్రెండ్లీనా?

చర్చలో పాల్గొనేటప్పుడు అందరితో ఫ్రెండ్లీగా ఉండాలి. చర్చ సాగించేటప్పుడు గుర్తించాల్సిన కొన్ని అంశాలు...

- తన కంటే ముందు మాట్లాడిన అభ్యర్థులు చెప్పిన విషయాలను గుర్తుంచుకోవాలి.
- స్పష్టమైన వైఖరితో ఉండాలి.
- చర్చ లక్ష్యాన్ని గ్రహించి తన దృష్టి కోణాన్ని ప్రతిపాదించాలి.
- ఇచ్చిన అంశంపైనే దృష్టి కేంద్రీకరించాలి.

చర్చ మొక్కుబడిగా, గంభీరంగా, నిరుత్సాహంగా జరగకుండా ఉత్తేజకరమైన స్నేహశీల వాతావరణంలో సాగితే మంచి ఫలితాలు వస్తాయి. చర్చలో విభిన్న భావధోరణులు ఉన్నవారు పాల్గొంటారు. విరుద్ధ అభిప్రాయాలు వ్యక్తమైనప్పుడు నైపుణ్యంతో సానుకూలతను తీసుకురావాలి. అభిప్రాయ భేదాలనే తప్ప వ్యక్తులతో విభేదాలు పాటించకుండా సామరస్యాన్ని పెంపొందించాలి.

### చొరవ చూపాలి

బృంద చర్చలో ప్రత్యేకంగా నాయకుడిని ఎన్నుకోవడం ఉండదు. చర్చించాల్సిన అంశాన్ని ప్రకటించగానే కాలయాపన చేయకుండా చొరవతో చర్చను నడిపించడం తక్షణావసరం కాబట్టి ఎవరో ఒకరు ప్రారంభించవచ్చు. అలా మొదలైన తర్వాత పాటించాల్సిన పద్ధతులను వివరించాలి. సమయపాలన, ప్రతి సభ్యుడి భాగస్వామ్యాన్ని తెలియజేస్తూ అందరూ చర్చపైనే దృష్టిని కేంద్రీకరించేలా చూడాలి.



### అర్థవంతంగా.. ముగింపు

నిర్ణీత కాలపరిమితిలో చర్చకు ఒక అర్థవంతమైన ముగింపును ఇవ్వాలి. సభ్యులందరూ చెప్పిన విషయాలను దృష్టిలో ఉంచుకొని సంక్షిప్త వివరణతో చర్చను ముగించాలి. సభ్యుల మధ్య అంగీకారం కుదిరిన అంశాలను, విభేదాల వివరాలను తెలియజేస్తూ ఒకరు చర్చను ముగించవచ్చు.

---

# Wishy washy..
# నిర్ణయం తీసుకోలేకపోవడం!

**ఇంగ్లిష్‌లో వాడుకలోకి వస్తున్న వ్యక్తీకరణలను గమనిస్తూ, వాటి ప్రయోగాన్ని తెలుసుకోవడం విద్యార్థులకు అవసరం. ఇలాంటి కొన్ని Expressionsను ఉదాహరణల సాయంతో నేర్చుకుందాం!**

MODERN ENGLISH USAGE

**Chaithanya:** Hi, Sekhar, long time, no see. Where have you been? (చాలా కాలమైంది నిన్ను చూసి. ఎక్కడికెళ్లావు?)

**Sekhar:** I had had to leave suddenly for Ananthapur a week ago. I returned only this morning (వారం క్రితం అనుకోకుండా అనంతపురం వెళ్లాల్సి వచ్చింది. ఇవ్వాళ పొద్దున్నే తిరిగొచ్చా).



ఎం. సురేశన్

**Chaithanya:** How is your preparation for the Civils? Keerthi is burning the candle at both ends to face the exam (సివిల్స్ పరీక్షకు ఎలా తయారవుతున్నావు? కీర్తి విరామం లేకుండా, చాలా కష్టపడి పరీక్షను ఎదుర్కోవడానికి సిద్ధమవుతోంది).

**Sekhar:** I think she is sure to succeed. She is leaving no stone unturned (తాను తప్పకుండా విజయం పొందుతుందనుకుంటా. చాలా గట్టి ప్రయత్నమే చేస్తోంది).

**Chaithanya:** She is like that. She is not wishy washy. Whatever she does, she does thoroughly (ఆమె ఎప్పుడూ అంతే. ఫలితంలేని ప్రయత్నాన్ని ఎప్పుడూ చేయదు. ఏది చేసినా క్షుణ్ణంగా చేస్తుంది).



**Sekhar:** That is true. I have to gird up my loins too, and do the same. By the way, did you discuss with Ananth your becoming his partner in business? (అది నిజమే. నేను కూడా నడుం బిగించి అలాగే చేయాలి. అదిసరే కానీ, అనంత్‌తో తన వ్యాపారంలో భాగస్వామి అయ్యే విషయాన్ని చర్చించావా?)

**Chaithanya:** Oh, it is over. It was a sweetheart deal. We had perfect understanding (ఆ, అది అయిపోయింది. ఇచ్చిపుచ్చుకోవడంతో జరిగిన ఒప్పందం అది. మాకు పూర్తి ఏకాభిప్రాయం కుదిరింది).

**Sekhar:** Congratulations. I was afraid it was going to be an elephant in the room. I am happy it ended without any hitch (అభినందనలు. అది మీరు చర్చించుకోవడం వదిలేస్తారేమో అనుకున్నా. అది ఏ సమస్య లేకుండా పూర్తైనందుకు నేను సంతోషిస్తున్నా).

**Chaithanya:** We are starting our business this June (ఈ జూన్‌లోనే మేం వ్యాపారాన్ని ప్రారంభిస్తున్నాం).

**Sekhar:** Thank God it was not an elephant in the room. I was afraid it might be so. Wish you all success and a prosperous business (అది ఏ గొడవా లేకుండా, అభిప్రాయభేదాలకు భయపడి చర్చించడం మానేయనందుకు నేను సంతోషిస్తున్నాను. మీకు విజయం, అభివృద్ధి కలగాలని కోరుకుంటున్నా).

**Now look at the following sentences from the conversation:**

1. **She is not wishy washy**
2. **It was a sweetheart deal**
3. **Thank god it was not an elephant in the room.**

**Now let us look at the expressions in detail.**

» **1. Wishy washy** = Unable to take a strong decision / vacillate (నిర్ణయం తీసుకోలేకపోవడం).

a) **Abhiram:** Vinod is weak minded. He lacks the ability to take a decision (వినోద్‌కు మానసిక దౌర్బల్యం ఎక్కువ. నిర్ణయం తీసుకునే శక్తి అతనికి లేదు).

**Arjun:** Yea, that is true. He is most often wishy washy. That is why he is not a success in life (అవును. అది నిజమే. చాలాసార్లు నిర్ణయం తీసుకోలేకపోతుంటారు. ఒక నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉండాలి).

b) **Jyothi:** Sita is very strong minded. Once she takes a decision she sticks to it (సీత చాలా గట్టి మనసున్నది. ఒక నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉంటుంది).

**Vaidehi:** Yea, you are right. She is not wishy washy. Once she thinks of doing something, she is firm about it (అవును. ఊగిసలాడే రకం కాదు తను. ఒకసారి ఏదైనా చేయాలనుకుంటే దాని విషయంలో చాలా గట్టిగా ఉంటుంది).

» **2. A sweetheart deal** = a business agreement, with give and take on both sides (ఇచ్చిపుచ్చుకునే వ్యాపార ఒప్పందం). ఇది ఇప్పుడిప్పుడే వాడుకలోకి వస్తున్న ప్రయోగం.

a) **Achyuth:** I never expected that our discussions would end so happily. Thanks a lot (మన చర్చలు ఇంత సంతోషకరంగా అవుతాయని నేను ఎప్పుడూ అనుకోలేదు. ధన్యవాదాలు).

**Bhanu:** I didn't either. I am very happy the discussions between us ended in a sweetheart deal (నేనూ అనుకోలేదు. మనిద్దరి మధ్య చర్చలు ఇలా ఇచ్చిపుచ్చుకోవడంతో అంతమయినందుకు నాకూ చాలా సంతోషంగా ఉంది).

b) **Peter:** Their discussions fell through. They could not come to an agreement, about their business (వాళ్ల చర్చలు విఫలమయ్యాయి. వాళ్ల వ్యాపార విషయంలో ఒక ఒప్పందానికి రాలేకపోయారు).

**Sagar:** Much against my expectations, it did not turn out to be a sweetheart deal. I really regret it (నేననుకున్నదానికి విరుద్ధంగా ఇచ్చిపుచ్చుకునే విషయంగా రూపొందలేదది. నేను చింతిస్తున్నా).

» **3. An elephant in the room** = a problem people avoid discussing because it is risky (చర్చించకుండా వదిలేసే సమస్య, అది పరిష్కారం కాదు కాబట్టి)- ఇది కొత్తగా వాడుకలోకి వస్తున్న పదం.

a) **Paratpar:** His starting a business is not to his father's liking. He thinks his son is not suitable (అతను వ్యాపారం ప్రారంభించడం, వాళ్ల నాన్నకు నచ్చలేదు. ఆయన అనుకుంటున్నాడు, అతను దానికి సరిపోడని).

**Bhaskar:** The topic has become an elephant in the room. Neither wants to discuss it. How long can they put it off? (అది వాళ్లమధ్య చర్చకురావడం ఇద్దరికీ ఇష్టం లేని విషయమైంది. ఇద్దరికీ ఇష్టం లేదు, దాన్ని చర్చించడం. ఎంతకాలం దాన్ని వాయిదా వేస్తారు?)

b) **Lakshman:** He got a job in a far-off place from home, that is, in Nagaland. His mother does not agree to his going there (ఇంటికి దూరంగా ఉన్న నాగాలాండ్‌లో అతనికి ఉద్యోగం వచ్చింది. వాళ్లమ్మకు ఇష్టం లేదు అతనక్కడికి వెళ్లడం).

**Bhargav:** That is a job with a fat salary, which he can ill afford to lose. However, it has become an elephant in the room. Neither his mother nor he wants to discuss it (అది మంచి జీతం వచ్చే ఉద్యోగం. దానిని అతడు కోల్పోలేడు. ఏదేమైనా సరే, అది వాళ్లిద్దరూ చర్చించడానికి ఇష్టపడని విషయం, అతనుకానీ, వాళ్లమ్మగానీ చర్చించాలనుకోవడం లేదు).

---

## నోటీస్ బోర్డు

**ప్రభుత్వ ఉద్యోగాలు**

**ఏపీ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్**

పోస్టుల సంఖ్య: 05

1) ప్రొక్యూర్‌మెంట్ స్పెషలిస్ట్ 2) జూ ఎక్స్‌పర్ట్ 3) ఎకో-టూరిజం ఎక్స్‌పర్ట్ 4) ఎంఐఎస్ స్పెషలిస్ట్ 5) జీఐఎస్ ఎక్స్‌పర్ట్ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్

**చివరితేది:** 02.01.2018. **వెబ్‌సైట్:** www.forests.ap.gov.in

**సాహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్**

**రిసెర్చ్ అసోసియేట్:** 12 పోస్టులు

**అర్హత:** పీహెచ్‌డీ (ఫిజికల్ సైన్సెస్, బయోఫిజికల్‌సైన్సెస్)

**వయఃపరిమితి:** 35 సంవత్సరాలు

**దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా

**చివరితేది:** 31.01.2018 **వెబ్‌సైట్:** www.saha.ac.in

**వాక్ఇన్**

**ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ బయాలజీ**

**జూనియర్ రిసెర్చ్‌ఫెలో:** 40 పోస్టులు

**అర్హత:** ఎంఎస్సీ (కెమిస్ట్రీ/బయాలజీ). నెట్/డీబీటీ/డీఎస్‌టీ-ఇన్‌స్పైర్/ఐసీఎంఆర్-జేఆర్ఎఫ్ ఉత్తీర్ణులై ఉండాలి.

**వయఃపరిమితి:** 28 సంవత్సరాలు.

**వాక్ఇన్ తేది:** 03.01.2018

**వెబ్‌సైట్:** www.career.iicb.res.in

**ఫెలోషిప్స్**

**ఎన్‌బీఈ - ఫెలోషిప్ ఎంట్రెన్స్ టెస్ట్-2018**

ఫెలోషిప్ ఎంట్రెన్స్ టెస్ట్-2018 **అర్హత:** ఎంబీబీఎస్. ఎండీ/ఎంఎస్/డీఎం. **దరఖాస్తు ఫీజు:** రూ.4,500 **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్. **ఎంపిక విధానం:** రాతపరీక్ష ద్వారా. **చివరితేది:** 11.01.2018 **రాతపరీక్ష తేది:** 17.02.2018

**వెబ్‌సైట్:**www.natboard.edu.in/fellowship.php/

**పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.**